నీరుపేదలు

- ఆచంట నియోజకవర్గంలో వరిసాగుకు తీవ్రమైన నీటి ఎద్దడి
- నోళ్లు తెరచుకుంటున్న వరిచేలు

పెనుగొండ: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందాన నియోజకవర్గంలోని రైతులు నీరుపేదలుగా మారుతున్నారు. సాక్షాత్తు నీటి పారుదల శాఖా మంత్రి ఉన్న జిల్లాలోనే రైతన్నలు సాగునీటి కోసం గగ్గోలు పెడుతున్నారు. వరి చేలు నోళ్లు వెళ్లబెట్టుకొని నీళ్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నాయి. పంట కాలువలు బాగు చేశామంటూ ఆర్భాటంగా ప్రకటించుకుంటున్నా, ఆ కాలువల్లో సాగు నీరు శివారు వరకూ ప్రవహిస్తుందా? అనే పర్యవేక్షణ కరువైంది. దీంతో రైతులు సాగు కోసం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి నాట్లు పడాల్సిన స్థితిలో కనీసం నారుమడులను రక్షించుకోలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చట్టాప్రదిక్షణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. వరి చేను గట్టుకు వచ్చిన ప్రజాప్రతినిధే కరువయ్యాడు. దీంతో రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కొందరు రైతులు మోటార్లతో నీళ్లతోడు కొని రక్షించుకోవడానికి ప్రయత్నిస్తుంటే, మరికొందరు యాతాంలతో అవస్థలు పడుతున్నారు. ఆచంటనియోజకవర్గంలో పెనుగొండ మండలంలో నడిపూడి, చినమల్లం, తామరాడ, దేవ, కొఠాలపర్రు, సోమరాజు చెరువు, వడలి వంటి గ్రామాల్లోని శివారు భూములు, ఆచంట, పోడూరు మండలంల్లో ఆచంట వేమవరం, గుమ్ములూరు, వల్లూరు, కొడమంచిలి, పెనుమంచిలి గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

తామరాడలో పచ్చపాతం?

పెనుగొండ మండలం తామరాడలో రైతులకు సాగు నీరు అందించడానికి కూటమి నాయకులు పచ్చపాతం చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లారు. టీడీపీ నేతల వరిచేలకు నీరు అందే వరకూ ఇతరుల వరిచేలకు నీరు అందనివ్వమంటూ హుకుం జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు నీటి సంఘం అధ్యక్షులు, అధికారులు సైతం వారికే వంతు పాడుతున్నారని తెలిపారు. దీంతో వరిచేలు బీడుబారి సాగు నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పచ్చపాతం చూపితే పోరాటం తప్పదంటూ రైతులు హెచ్చరిస్తున్నారు.


చినమల్లంలో కనీసం దమ్ము చేయడానికి అందని సాగునీరు


తామరాడలో సాగునీటి ఎద్దడితో సాగుకు సిద్ధం కాని వరిచేలు


చినమల్లంలో ఎండుతున్న నారుమడులు

క్లుప్తంగా

శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు


తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న డేవిడ్ రాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన బి.డేవిడ్ రాజు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డేవిడ్‌రాజును ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీ నాయకులు కోట వెంకటేశ్వరావు, యల్లమెల్లి రాజేష్, మట్టా ఆనంద్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి


ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నరసాపురం రూరల్: పలు పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, ఇతర సమస్యలపైన యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నరసాపురం ఎంఈఓ పిల్లి పుష్పరాజ్యంకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె వీలైనంత త్వరలో ప్రభుత్వాదేశానుసారం పని సర్దుబాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణకుమారి, మండల శాఖ గౌరవాధ్యక్షుడు. పి.శాంసన్, అధ్యక్షుడు ఎన్వీ సత్యనారాయణ, మహిళా సహాధ్యక్షుడు ఉప్పుగంటి రాజశ్రీ, ఎస్.అజయ్ కుమార్, కె.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాలకోడేరు మండలానికి చెందిన నలుగురు పాతనేరస్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బాలరామరాజు తెలిపారు. కె.ఏసుపాదం, లక్ష్మీగణేష్, తాతాజీరావు, రాజేశ్వరరావులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని, ఏడాది కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడి దొరికితే ఉల్లంఘనల కింద రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బంగారం గొలుసు చోరీపై కేసు నమోదు

భీమవరం(ప్రకాశం చౌక్): బంగారం గొలుసు చోరీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం భీమవరం రెండో పట్టణానికి చెందిన పలివేల కృష్ణ ఈనెల 14 తేదీన మూడు కాసుల బంగారం గొలుసును బ్యాంకులో పెట్టేందేకు ఆటోలో వెళ్లాడు. తీరా ఆటో దిగిన తరువాత గొలుసు కనిపించ లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.రెహమాన్ తెలిపారు.

డ్రెయిన్ పనుల పరిశీలన

ఉండి: బొండాడ మేజర్ డ్రెయిన్‌లో వెలివర్రు వంతెన వద్ద జరుగుతును తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎస్ఈ పీ నాగార్జునరావు శనివారం పరిశీలించారు. డ్రెయిన్‌లో తూడు చెత్త పనులు పూర్తిస్థాయి పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉండి ఆక్విడెక్టు, పాములపర్రు, వెలివర్రు వంతెన, వాండ్రం, కోపల్లె, బొండాడ, ఈలంపూడి గ్రామాల్లో పనులను ఆయన పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మోషేన్‌రాజుతో వీరవాసరం మండల నాయకులు

వీరవాసరం: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారంపూడి సురేష్ కుమార్, టీయూసీ అధ్యక్షుడు గెద్దం మునలయ్య, దళిత నాయకులు శనివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు, వెంకటరాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు నేతల జ్ఞాన సుందర్ రాజు, వీరవాసరం సర్పంచ్ చికిల్ మంగతాయారు, వీరవాసరం మండలం ఉపాధ్యక్షుడు బొంతు రమేష్, నాయకులు గోడి షణ్ముఖరావు, పరువు వెంకటేశ్వరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలమూరి బుల్‌రాజు, పత్తుల బైసన్, బొప్పల బాబ్జి, చిన తాతారావు, నల్లమిల్లి రామకృష్ణ, అల్లరాజు, మేడే నరేష్, మండల వెంకట నరసయ్య, కె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు దిగువ కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, శ్రీ చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలు ఈ నెల 24 నుంచి నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రూ.100 చెల్లించి పేరు నమోదు చేయించుకున్న భక్తులకు పూజా సామాగ్రి, సారె ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మానెం బసవరాజు, ఆలయ ధర్మకర్తలు బాసిన గున్నేశ్వరరావు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

యలమంచిలి: దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల గుర్తింపు శిబిరం ఆదివారం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కాన్పూర్‌కు చెందిన కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ప్రతినిధులు శిబిరంలో అర్హత, అవసరత కలిగిన దివ్యాంగులను పరీక్షించి సహాయ పరికరాలను ఇచ్చేందుకు ఎంపిక చేస్తారని వివరించారు. అర్హులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జలమయమైన పాలకొల్లు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ సెంటర్, సంత మార్కెట్, ఫ్రూట్స్ మార్కెట్ ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్‌లో మోకాలి లోతు నీరు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాపారం జోరుగా సాగుతున్న సమయంలో పాలకొల్లు సంత మార్కెట్ సందడిగా ఉండగా ఒక్కసారిగా కురిసిన వర్షానికి కొనుగోలుదారులు పరుగులు తీశారు. దీంతో కూరగాయల వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారు. ఎంత సేపటికీ నీరు లాగకపోవడంతో వ్యాపారాలు మూసేసుకున్నారు. ఫ్రూట్స్ మార్కెట్ ప్రాంతంలో కూడా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కేవలం ఒక గంట కురిసిన వర్షానికే పరిస్థితి ఈ విధంగా ఉంటే వర్షాకాలంలో మరింత గడ్డు పరిస్థితి ఉంటుందని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.


వర్షపు నీటిలో ఫ్రూట్స్ మార్కెట్


సంత మార్కెట్‌ను ముంచెత్తిన వర్షపు నీరు


బస్టాండ్‌లో నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణీకులు

ప్రత్యేక శిబిరం వాయిదా

పెనుగొండ: విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు వినికిడి పరికరాలు అందించడానికి ఈ నెల 21న నిర్వహించనున్న ప్రత్యేక శిబిరం వాయిదా వేసినట్లు ఆచంట మండల ఎంపీడీఓ బీఎస్ కృష్ణ మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా ప్రకటించిన విధంగా పెనుగొండ పంచాయతీలో జరగాల్సిన శిబిరాన్ని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని స్పష్టం చేశారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల దివ్యాంగులు ఎవరూ పెనుగొండ రావద్దని కోరారు.

వైఎస్సార్ సీపీ మండల సమావేశం వాయిదా

యలమంచిలి: స్థానిక శ్రీ తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించాల్సిన వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని వాయిదా వేశామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులంతా సమావేశ మార్పును గమనించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు టీ షర్టుల అందజేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని గాంధీ నగర్ (పందిగుంట) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులకు దాతలు శనివారం టీ షర్టులు అందించారు. ఉపాధ్యాయుడు రాయపూడి భవానీ శంకర్ ప్రసాద్ ప్రోత్సాహంతో దాతలు విద్యార్థులకు టీ షర్టులను సమకూర్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిల్ల సురేష్ బాబు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతులు

నరసాపురం రూరల్: నరసాపురంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలను ఆర్డీఓ దాసి రాజు ప్రారంభించారు. సంసిద్ధ్ టాటా ఇంప్రింట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు ఆరోగ్యంపై అవగాహన సదస్సు

పాలకోడేరు: పాలకోడేరు వాకర్స్ అసోసియేషన్, ఉషోదయ మహిళ వాకర్స్, మోగల్లు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలకోడేరు శివారు పెద లోగిల్లు గోస్తని గుడి వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడుగాదిరాజు కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో వర్మ హాస్పిటల్, ఇంపీరియల్ హాస్పిటల్ భీమవరం, లలిత హాస్పిటల్, నరసాపురంనకు చెందిన డాక్టర్లు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

శాకంబరిగా అమ్మవార్ల అలంకరణ

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామం పులపర్తివారితోటలో ఉన్న గ్రామదేవతలైన శ్రీ గుడవళ్లమ్మ, శ్రీకుంకుళ్లమ్మ అమ్మవార్లను శనివారం శాకంబరి దేవిగా అలంకరించారు. అర్చకులు కూరగాయలు, ఆకుకూరలు తదితర వాటితో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శించుకన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ఆషాఢ మాసం సందర్భంగా పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం పక్కన రామగుండం పార్కులో ఉన్న పుంతలో మునలమ్మ అమ్మవారిని శనివారం శాకంబరిగా అలంకరించారు. ప్రముఖుల సహకారంతో అర్చకులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.


శాకంబరిగా గుడవళ్లమ్మ


శాకంబరిగా పుంతలో మునలమ్మ

స్పీడ్ బ్రేకర్లు వేయండి మహాప్రభో..!

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్ఆర్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతీ రోజూ ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం మీదుగానే వెళ్లాలి. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఈ ప్రాంతంలో వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.


రద్దీగా ఉన్న స్టీమర్‌రోడ్డు జంక్షన్ ప్రాంతం

అణగారిన వర్గాలకు న్యాయసేవలు అందాలి

నరసాపురం: సమాజంలో అణగారిన వర్గాలకు సైతం న్యాయ సేవలు, న్యాయ పథకాలు అందాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన జాగ్రతి పథకంపై శనివారం కోర్టు హాల్లో జాగృతి యూనిట్ సభ్యులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో జడ్జి వాసంతి మాట్లాడారు. అన్ని శాఖల నుంచి అధికారులను సమన్వయం చేసుకుంటూ అన్ని వర్గాల వారికి, ముఖ్యంగా నిరక్షరాస్యులకు న్యాయఫలాలు అందించాలనే ఉద్దేశంతో జాగృతి పథకాన్ని జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని చెప్పారు. పథకంలో భాగంగా మారుమూల గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.గంగరాజు, ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, సీఐ బి.యాదగిరి, ఎంపీడీఓ రామకృష్ణంరాజు, రైల్వే ఇన్‌చార్జ్ మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: మాట్లాడుతున్న జడ్జి వాసంతి

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కోర్టు ప్రాంగణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పాలకొల్లు చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ శనివారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వర్గాలకు సమాచార పారదర్శక, న్యాయ అవగాహన కల్పించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.పూర్ణ రవిచంద్ర, కె.యోహాను, టౌన్ సీఐ కోలా రజినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు సెంట్రల్: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

ఎండుతున్న నారుమడులకు నీరు అందించాలి

యలమంచిలి: మండల కేంద్రంలోని గొల్లేపర చెరువు గట్టు ప్రాంతంలో దేవుడు మాన్యం, తవ్వకోడు, తూములకోడు ఆయకట్టులో ఎండుతున్న నారుమడులకు తక్షణం సాగు నీరు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎండిన నారుమళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ పంటకు ఇంత దారుణమైన పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. వందలాది ఎకరాల్లో నారుమళ్లు, పంటలు ఎండుతున్న అధికారుల్లోనూ, ప్రజా ప్రతినిధుల్లోను చలనం లేదని విమర్శించారు. సాక్షాత్తు జలవనరుల శాఖ మంత్రి నియోజకవర్గంలో సైతం సాగునీరు అందక నారుమడులు ఎండిపోతున్నా ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, నీటి సంఘాల కమిటీలకు రైతుల కష్టాలు, నష్టాలు పట్టనట్టు వ్యవహరించడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే పంట పొలాలను పరిశీలించి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవురు వెంకట సత్యనారాయణ, తమ్మినీడి కృష్ణార్జున, కవురు రామ వెంకట సత్యనారాయణ, ఉండ్రు తాతయ్య, తంగెళ్ళ వెంకటకృష్ణ, కొడవటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డులా మారిన సీసీ రోడ్డు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో యథేచ్ఛగా మట్టి రవాణా జరుగుతుంది. లారీల్లో వారి ఇష్టానుసారంగా మట్టి అధికంగా లోడింగ్ చేసుకురావడంతో వాహనాల్లో నుంచి మట్టి రోడ్డుపై పడిపోతుంది. దానికి వర్షం తోడవడంతో ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిళ్ల, బస్‌లు ఎక్కడానికి పరుగులు పెట్టే సమయంలో జారి పడిపోతున్నారు. స్థానిక ప్రజలు దీనిపై ఎన్ని అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నా లారీల నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. రహదారిలో ఉన్న వైర్లు సైతం తెంపుకుంటూ పోతున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక మారుతి సెంటర్ నుంచి బొర్రావారి తోట వద్దకు వెళుతున్న టిప్పర్ లారీలతో అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. టిప్పర్ వాహనాలను ఆపి ప్రశ్నిస్తుంటే డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


మట్టి రోడ్డులా మారిపోయిన సీసీ రోడ్డు

అదనపు లోడింగ్ వల్లే

లారీల్లో లోడింగ్ తక్కువగా వేసుకుంటే ఇలా రోడ్లపై మట్టి జారే పరిస్థితి ఉండదు. కానీ మట్టి అదనంగా వేసుకురావడం వల్లే సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అంతే కాకుండా వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు ఎత్తుగా ఉండే ప్రాంతాల్లో ఎక్కుతున్నప్పుడు, స్పీడ్ బ్రేకర్లు వద్ద లారీ జంపింగ్ చేసే సమయంలో మట్టి గడ్డలు రోడ్డుపై పడిపోతున్నాయి. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారులుగానీ, పాదచారులు గాని ఉంటే అవి వారిపై పడిపోయే ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి టిప్పర్ లారీల్లో లోడింగ్ పరిమాణం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే రాత్రి సమయాల్లోనైనా ట్రాన్స్‌పోర్టు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


మట్టి గడ్డలు రోడ్డుపై పడిపోయే విధంగా లోడింగ్ చేసుకుని వెళ్తున్న టిప్పర్ లారీ